# అసలు సంగతి

## కొంపల్లి బ్రహ్మానందరావు

"అన్నయ్యకు నమస్కరించి వ్రాయునది:
బాగా చదువుకుంటూ క్షేమముగా వున్నావనుకుంటాను. ఇదివరకు మాదిరిగా నీ అన్నిట్లోను ఫస్టుమార్కులు సంపాదించుకుంటున్నావుకదా! లేక ఇవి చిన్న చిన్న లెక్కలుకాదు బి. ఏ. మేథమేటిక్సు- నీకు తెలీదు- అని ఎప్పటిమాదిరిగా నాతో పోట్లాడుతావా! ఏమైనా చదువులో బాగానే పైకివస్తావని అమ్మా నేనూ అప్పుడప్పుడూ అనుకుంటూ వుంటాము.

అసలు ఈ జాబుకు ఒక ప్రత్యేక కారణము వుంది. చాల మంచివిషయం. శుభమైన సంగతికాబట్టి చాలా చక్కగా వ్రాస్తున్నాను. దస్తూరికూడ ముత్యాలలాగ కుదురుతోంది. కొన్నాళ్ళలో బి. ఏ. ప్యాసౌతున్నావు కాబట్టి త్వరగా వివాహం చేస్తానని అమ్మ తొందరపడుతోంది. నీకు చక్కటి ఓ చుక్కను చూసి అమ్మ ఇవాళ నామీదపడాలని ఆదుర్దాపడుతోంది. కనుక ఈ జాబు చూచినవెంటనే, మేము నిన్నగాక మొన్నటి రోజున చూచివచ్చిన డాక్టరుగారి అమ్మాయిని పెళ్ళిచూపుల్లో చూచేందుకు బయల్దేరి రావలసినదిగా అమ్మ నన్ను గట్టిగా వ్రాయమని ఆజ్ఞయిచ్చింది కావున వ్రాస్తున్నాను. వెంటనే వున్నపళాన రావలెను. నామటుకు అమ్మాయిగురించి చెప్పాలంటే చాలా బాగుందంటాను. నీ అభిరుచికి తూగగల అందగత్తె. చుక్కల్లో చుక్క, రత్నాలలో రత్నం. మణుల్లో కాంతివంతమైన మణి. సరేనా?

అన్నయ్యా వెంటనే బయల్దేరు,
వస్తాను.

నీ చెల్లాయి,
సావిత్రి.

* * *

"చెల్లాయిని దీవిస్తూ,
నీ జాబు అందినది. శుభమైన విషయం తెలుసుకున్నాను. అమ్మ నా వివాహవిషయం గురించి తొందరపడుతోందని వ్రాశావు. అలా తొందరపడవద్దని వెంటనే చెప్పు. చదువు పూర్తయి, మంచి వుద్యోగములో ప్రవేశించేంతవరకు నేను పెళ్లి చేసికోనని గట్టిగా చెప్పు. అందువలన ఆ అమ్మాయి వర్ణనతో నాకు పనిలేదు. మరో సంబంధం చూసుకోమని పాపం వాళ్ళతో చెప్పు. బాగుపడుతారు.

చెల్లాయీ! నా వివాహం వెనక్కుపోయిందని బాధపడతావేమో! రేపు సెలవులకువచ్చి నీకొక మంచిసంబంధం అక్కడ చూపిస్తానని అమ్మతో చెప్పు.

సరేనా, వస్తాను,

అన్నయ్య
మూర్తి."

* * *

"అన్నయ్యా,
జాబు అందినది. విషయాలు విని అమ్మ కేకలేసింది. నువ్వు విధిగా ఇప్పుడే వివాహం చేసుకోవాలని అంటూంది. మొన్న మేము చూచివచ్చిన విజయలక్ష్మి చాలా బాగున్నది. ఇంటిపనులు బాగా చేస్తుందని, అందువలన ఆ సంబంధం వదులుకో కూడదని అమ్మ పట్టుపట్టింది. పైగా అంతో, ఇంతో కట్నంకూడా ఇస్తారట. మారు మాట్లాడక క్షణములో బయల్దేరమంటూంది.

ఇక నేను నా వివాహంగురించి త్వరపడుతున్నానని అనుకుంటున్నావు. దీనికికూడ అమ్మే జవాబు చెప్పింది. ఎప్పటికైనా నీ వివాహం అయినతర్వాతనే నాకు చేస్తుందట. పీటలమీద మీ ఇద్దరూ కూర్చుని జరపాలట. అందుకని నీకయిన తర్వాతనే నాకు. అసలు ఇప్పుడిప్పుడే నేను చేసుకోవాలని అనుకోవడంలేదు, అదీగాక, నా అభిప్రాయం అడిగితే. వుద్యోగంలో ప్రవేశించేంతవరకు అవివాహితుడుగా వుండాలనే నీ వుద్దేశం మంచిదే అంటాను. అమ్మ తొందరవల్ల నేను వ్రాస్తున్నాను. అంతే.

ఇంతకీ అమ్మ అనేది ఏమిటంటే వెంటనే చూపులకు రమ్మని.


నీ చెల్లాయి
సావిత్రి."

* * *

"చెల్లాయికి,
మాటి మాటికి నన్ను వేధిస్తూ వుత్తరాలు వ్రాయవద్దు. నా వివాహం గురించి నాకు తొందరలేదు కాబట్టి, మీకు అంతకన్నా వద్దు. మంచి కట్నం వస్తుందని వ్రాశావు. ఏమైన పరువు వుంటుందా కట్నం తీసుకుంటే! కట్నాలు తీసుకోవద్దని వుపన్యాసాలు ఇస్తూ, 'వరకట్న నిషేధం' అంటూ వ్యాసాలు, కథలూ వ్రాస్తూ కట్నం ఆశపడితే ఎంత అవమానం!...

చెల్లాయి! అమ్మకు అన్నీ వివరంగా చెప్పి గొడవ చెయ్యవద్దని చెప్పు.

నీ అన్నయ్య
మూర్తి."



"అన్నయ్యకు,

జాబు అందినది. నువ్వు ఇక్కడ ఇంటర్ చదువుతున్నప్పుడు కిటికీలోంచి చూచే పక్కింటి అమ్మాయి కళ్యాణిని చేసుకుంటావేమో అమ్మ వ్రాయమంది. అమ్మకు ఏమీ అభ్యంతరము లేదట. – ఎలాగయినా ఈ మాసములోనే అమ్మ నీకు పెళ్లి చెయ్యాలని మంకుపట్టు పట్టింది. కనుక పై విషయం గురించి వెంటనే జాబు వ్రాయవలెను.

నీ చెల్లాయి
సావిత్రి"

*　　*　　*

"చెల్లాయికి,

కిటికీలోంచిచూసే కళ్యాణిని చేసుకోవాలని అనుకుంటూ, అమ్మ చూచిన సంబంధం కాదంటున్నానని మీరు అభిప్రాయపడితే, అంతకన్నా పొరబాటు మీరు, మీ జీవితములో పడరు. ఆ అమ్మాయి అభిప్రాయం ఏమిటో నాకైతే అంతుపట్టలేదు గాని, నామటుకు నేను ఆ కళ్యాణిని చేసుకోవాలని ఎన్నడూ అనుకోలేదు. నా గదికి ఒక్కటే కిటికీ, అదీ వాళ్ళింటి వైపున వుండటం కేవలం నా దురదృష్టం లాగుంది. కిటికీకి తగిలించిన అద్దములో తలదువ్వుకోటానికి వచ్చినప్పుడల్లా ఆ పిల్ల కనిపిస్తూ వుండటం మినహాయించి మళ్ళీ మరొకప్పుడు చూడటం అనేది జరిగేది కాదు. కనుక కళ్యాణి కొరకు అమ్మ ఏరిన విజలక్ష్మిని కాదంటున్నానని తలంచటం పొరబాటు అని చెప్పి, ఇక నా వివాహ ప్రసక్తి ఆపేయమని గట్టిగా చెప్పు.

అన్నయ్య,
మూర్తి."

*　　*　　*　　*

"అన్నయ్యకు,

జాబు అంది సంగతులు తెలిసినవి. అమ్మకు అన్నీ చెప్పాను. 'వాడి మొహంలే' అంది. కాని నీ వివాహం ఈ మాసములో జరగాలని పట్టుపడుతోంది. ఆడవాళ్ళపట్టు నీకు అంతుపట్టదన్నయ్యా! మంకుపట్టు, గయ్యాళితనం మొదలయినవి ఆడవాళ్ళకి పర్యాయపదాలు. అందుకే కోరిన చీరలు, కావలసిన చంద్రహారాలు, పోవాలనుకున్న సినిమాలు సక్రమముగా జరుగుతున్నాయి. అమ్మ ఇంకోటి అంటోంది. ఫిజిక్సు ట్యూషనులో మేష్టారి దగ్గర నీతోబాటే చదువుకున్న లలితను చేసుకోవటానికి ఇష్టంగా ఉంటే రాయబారాలు జరపటానికి అమ్మ సిద్ధంగా వుందట. ఏ సంగతి వెంటనే వ్రాయి.

చెల్లాయి,
సావిత్రి."

*　　*　　*　　*

"చెల్లాయి,

మీ ఇద్దర్నీ చూస్తుంటే మింగెయ్యాలనిపిస్తోంది. పెళ్ళి... పెళ్ళి! నా పెళ్ళిగురించి మీకు ఎందుకు ఇంత గుంజాలాటో అర్థము కాకుండా వుంది. ఒక దణ్ణం పెడతాను. అమ్మతో చెప్పి నా వివాహం సంగతి వ్రాయటం మానెయ్యమను. పాపం! ఆ కళ్యాణిని, ఆ లలితను అనవసరముగా బైటికి తెస్తున్నారు. చాలా తప్పు.

(64-వ పేజీ చూడండి)




అర

: ఎమ్. అప్పారావు.

## జీవనలీల

వనవిహారితప్పు ఏమిటో మతికి బోధపడలేదు. దాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి కలగలేదామెకి. వనవిహారిమాటల్లో హృదయం, సానుభూతీ ఉన్నాయి. పుట్టిపెరిగిన ఊరువిడిచి, నా అన్నవారినందర్నీ విడిచిపెట్టి—చిన్నపిల్లతాను ఆ అపరిచితమైన విచిత్ర జగత్తులోకి వచ్చిపడిందన్న సంగతి ఒక్క వనవిహారి వినా కుముద్ స్నేహితుల్లో ఎవరికీ తట్టనేలేదు. రెండురోజులు పోయాక ఓనాడుదయం వనవిహారి మళ్లీ వచ్చాడు. "రా, కుముద్! ఇవాళే వెడదాంరండి, భోజనం ఇవాళ్టికి అక్కడే చెయ్యవచ్చు" అన్నాడు.

కుముద్ ఆవులిస్తూ "వస్తాంలే, వస్తాం. ఇంత హడావిడి ఎందుకు?" అన్నాడు.

వనవిహారిముఖం కొంచెం గంభీరంగా కన్పించిందిప్పుడు. "నీ సంగతేమిటో చెప్పు కుముద్. ఆర్నెల్లయింది నువ్వు మావైపుకి వచ్చి. రమ్మంటే ఆవలిస్తావేమిటిప్పుడు? వారంరోజులు నువ్వు కన్పించకపోతే బెంగపెట్టుకుంటుందికదా మాకు! హఠాత్తుగా మమ్మల్నందర్నీ వదిలేశావల్లే ఉందే?" అన్నాడు.

"వదిలెయ్యటమా? అలా త్యజించే స్వభావం లేనివాడు [illegible] ఊరికే అలసటమూలంగా వచ్చింది ఆవలింత"

"ఆ సమావం పడుకుని ఉన్నా అలసటేనా! సరే ఇవాళ [illegible] మని అడగనులే."

"అడగటం ఎందుకు? రేపో—ఎల్లుండో చటుక్కున వచ్చి పడతాం, చూస్తూ ఉండు"

వన విహారినవ్వాడు. "బహుశా ఈలోగానే జయచటుక్కు ఇక్కడికి రావచ్చు. ఆమెవచ్చి నీ కేంశాస్తి చెయ్యనున్నదో ఊహకి అందటంలేదు. ఈపిల్లని లాక్కుపోయి ఓనెల్లాళ్ళు నీ[illegible] కన్పడకుండా దాచేస్తుందేమోలే."

వనవిహారి పిల్ల అనటం కుముద్ కి బాగానేఉంది. అయినా "అదేమిటి మళ్లీపిల్ల అని అంటావ్?" అన్నాడు.

వన విహారి వెళ్లిపోయాక "పోనీ వెడదాం రారాదూ ఓసారి—అన్ని విధాల చెప్పి వెళ్లాడాయె"అన్నది కుముద్ తో మతి. కుముద్ నవ్వుతూ—"అతడేమిటి చెప్పేది! అతడి నోటిమీదుగా చెప్పించినవారు మరొకరు. ఆమె పేరు జయ. ఆవిడ, అతడి భార్య. వెడదాం, ఈలోగానే ఎప్పుడో ఒకసారి వెడదాం" అన్నాడు.

(ఇంకా ఉంది)

---

## ★ బాధ్యత ★

(27-వ పేజీ తరువాయి)

మూర్తి. తన బాధ్యత మరచి ప్రవర్తించిన ఫలితాన్ని గమనించి రాజమ్మ కుమిలి పోయింది.

మర్నాటికల్లా మూర్తికి జ్వరం తగిలింది.

ఉపచారాలు చేయబోయిన వారినందరిని తన కేమి వుపచారం చేయనవసరం లేదంటూ మూర్తి వారించేవాడు. గతిలేక రాజమ్మ వొకటి రెండు రోజులూరుకుంది.

రోజురోజుకి జ్వరం తీవ్రరూపం దాల్చింది. విశ్వనాథయ్య మంచి డాక్టర్ని కుదిర్చాడు. రాత్రిపగలు నిద్రాహారాలు మాని చిట్టి భర్తకు సేవచేసింది.

ఉత్తమురాలైన కోడలిని కష్టపెట్టినందుకు రాజమ్మ విచారించింది. ఇన్నాళ్లకైనా భార్య కోడలిని అర్థం చేసుకున్నందుకు విశ్వనాథయ్య ఆనందించేడు.

డాక్టరిచ్చిన మందులవల్లా, చిట్టి సేవల ఫలితంగాను మూర్తికి నెమ్మదించింది.

కొడుకుపై ఆశలు వదలుకొన్న రాజమ్మ అమితానందం పొందింది. డాక్టర్ని వేనోళ్ల కొనియాడింది, తన కుమారుని బ్రతికించినందుకు.

"నేనిచ్చిన మందులకన్నా మీ కోడలు చేసిన సేవఫలితంగానే మీ అబ్బాయి బ్రతికేడంటూ" డాక్టరు అన్నమాటలు విని రాజమ్మకంట తడిపెట్టుకుంది, కోడలిని అర్థంలేని ద్వేషంతో కష్టపెట్టినందుకు.

డాక్టరు మాటలువిని మూర్తి చకితుడయ్యాడు. భార్యపై తను చూపిన నిరాదరణకీ—భార్య తనపై చూపే ఆదరణకీ వ్యత్యాసం తెలుసుకొని చింతించాడు. నిద్రాహారాలు లేక కృశించిన భార్యను చూసి "నన్ను క్షమించవూ?" అంటూ ప్రార్థనపూర్వకంగా అడిగాడు.

బత్తాయిరసం భర్తకిద్దామని వెళ్ళిన చిట్టి భర్తమాటలు విని దిగ్భ్రాంతి చెందింది.

భార్యను దగ్గరకు తీసుకుంటూ మళ్లీ అడిగాడు: "నీ పట్ల నీచంగా ప్రవర్తించిన నన్ను క్షమించవూ...?"

"మిమ్మల్ని సరిగా గౌరవించక మీలో అశాంతిని రేకెత్తించిన నన్నే మీరు క్షమించాలి?" లాలనగా అన్నది చిట్టి.

"చిట్టీ నీ హృదయం ఎంత విశాలమైంది!"

కిలకిల నవ్వింది చిట్టి.

వేయివీణ లొక్కసారి తన హృదయంలో మ్రోగినట్టు సంతసించాడు మూర్తి.

బయటనుంచి వారి సంభాషణ విన్న విశ్వనాథయ్య, నేటితో తన బాధ్యత తీరిందని ఆనందించాడు. ★

---

## ★ అసలు సంగతి ★

(28-వ పేజీ తరువాయి)

అమ్మతో చెప్పి ఆపితే నీ మేలు మర్చిపోలేను చెల్లాయీ.

అన్నయ్య,
మూర్తి."

* * * *

"అన్నయ్యకు,

నీ ఇష్టప్రకారమే అమ్మతో అన్నీ చెప్పి ఒప్పించాను. కాని చివరకు ఒకటున్నది. మతాంతరం కాకుంటే నువ్వు అభిలాష పడుతూన్న ఏ కులస్థురాలైనా అమ్మకు అభ్యంతరము లేదట. కనుక ఎవర్నయినా ఏరుకోవచ్చు.

మరి చూసుకో నాన్న.

చెల్లాయి,
సావిత్రి."

* * * *

"చెల్లాయీ!

అయితే నేను వుంటూన్న ఇంటివారమ్మాయి, డాక్టరు చదువు చదువుతూన్న అరుంధతిని చేసుకోదల్చానని అమ్మతో చెప్పి అప్పడాలు, ఒడియాలు సిద్ధం చెయ్యమని చెప్పు. ఇది నిర్ణయం అయిపోయింది. అమ్మ అనుమతికోసమే ఇంతకాలం ఆగాను. ఇపుడు లభించింది కనుక బైటపెట్టాను. పిల్లవాళ్లు మనవాళ్ళే! భయపడనక్కర్లేదు.

మూర్తి."

* * *

"అన్నయ్యా,

బాగుంది. బలేటక్కరి. అందుకా ఇంత నాటకం! అమ్మకూడా తెలివైనదేలే. ఈ సంగతి అమ్మకు ఈ మధ్యనే తెలిసింది. ఎవరితోనో తిరుగుతున్నావని, సినిమాలకు వెళ్లటం సాగించావని ఆ వూరినుంచివచ్చిన వాళ్లు చెప్పారు. అందుకే అమ్మ ఇంత తొందరపడింది. 'నల్లగా వున్నది అమ్మాయి' 'బలే నాజూకు పిల్ల!' 'పెద్దగా బాగులేదు' అనేవారి వర్ణన విని పరాయిమతం పిల్లను చేసుకోదల్చావని భయపడింది. మన వాళ్ళయితే అంతకన్నా కావలసిందేముంది?

వెంటనే బయల్దేరిరా. వివరాలు తెలుసుకుంటాం.

చెల్లాయి,
సావిత్రి." ★

---

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad